


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 81 | శుక్రవారం 21 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి..
## అగ్రనేతల ఘన నివాళి..

భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు ఆగస్టు 20 ఘన నివాళులు అర్పించారు.సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు.



## అమెరికాది 'ఆర్థిక ఉగ్రవాదం':
## ట్రంప్ హెచ్చరికల పై ఇరాన్ ఘాటు స్పందన

- సొంత దేశం సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ట్రంప్ ప్రయత్నమని ఆరోపణ
- అమెరికా అప్పు 40 ట్రిలియన్ డాలర్లకు చేరిందన్న ఇరాన్ విదేశాంగ మంత్రి
- ఈ విధానాలు అమెరికా ఓటమికే దారితీస్తాయని వ్యాఖ్య



## రూపురేఖలు మార్చే జహీరాబాద్ ప్రాజెక్ట్..
## 2028 నాటికి పూర్తికి తెలంగాణ సర్కార్ ప్లాన్



- జహీరాబాద్ స్మార్ట్ సిటీతో రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 2 లక్షల ఉద్యోగాల లక్ష్యం
- 2028 మార్చి నాటికి మౌలిక సదుపాయాల పూర్తికి ప్రణాళిక
- మొదటి దశలో 3,245 ఎకరా ల్లో పారిశ్రామిక నగరం నిర్మాణం
- ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలపై ప్రధాన దృష్టి
- హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా అభివృద్ధి

## మూడు రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్..



- అమరావతి, బెంగళూరు, చెన్నైలను కుప్పం మీదుగా అనుసంధానం
- గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- విభజన సమస్యలను త్వరగా తేల్చాలని కేంద్రానికి విజ్ఞప్తి
- దక్షిణ మండల మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక సూచనలు

## ఉచిత పథకాల పై
## తెలంగాణ హైకోర్టు ఆగ్రహం..




- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ల పై స్టే ఎత్తివేతకు నిరాకరణ
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్న తెలంగాణ హైకోర్టు
- ఉచిత పథకాలకు నిధుల మళ్లింపు వల్ల అత్యవసర రంగాల పై ప్రభావం పడుతోందని వ్యాఖ్య
- నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఉచితాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్య

## శాసనమండలిలో మంత్రి లోకేశ్
## ప్రవేశపెట్టిన 5 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం



- శాసనమండలిలో 5 కీలక బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి లోకేశ్
- విద్యా, గ్రంథాలయ, నైపుణ్య రంగాలకు సంబంధించిన బిల్లులు
- ఆమోదం పొందిన వాటిలో ప్రైవేటు స్కిల్ వర్సిటీల బిల్లు కూడా ఉంది

## మంత్రి పొంగులేటి క్షమాపణ చెప్పడం సిగ్గుచేటు

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు.



VARTHAA SAKSHAMU
RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## అమెరికాది 'ఆర్థిక ఉగ్రవాదం': ట్రంప్ హెచ్చరికల పై ఇరాన్ ఘాటు స్పందన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఆర్థిక హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. అమెరికా చర్యలను ఆర్థిక ఉగ్రవాదంగా అభివర్ణించిన ఇరాన్ ఇవి ఆ దేశ పతనానికే దారితీస్తాయని హెచ్చరించింది. ఇరాన్ పై ట్రంప్ ప్రకటించిన ఆర్థిక యుద్ధాన్ని ఆ దేశ విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అమెరికా ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యల నుంచి ప్రపంచం దృష్టిని మళ్లించేందుకే ఆ దేశ ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని ఇరాన్ అధికారులు ఆరోపించారు. భారీగా పెరిగిన అప్పులు, వడ్డీల భారం వంటి సంక్షోభాల నుంచి గట్టెక్కేందుకే ట్రంప్ ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారని వారు విమర్శించారు. ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా స్పందించారు. అమెరికా సాగిస్తున్న 'ఆర్థిక ఉగ్రవాదం' ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, వివిధ దేశాల సార్వభౌమాధికారానికి పెను ముప్పుగా పరిణమించిందని పేర్కొన్నారు. అమెరికా అప్పులు సుమారు 40 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయని గుర్తు చేస్తూ, ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు ఆ దేశ రుణభారాన్ని మరింత పెంచుతాయని విమర్శించారు. ఇరాన్‌కు సహకరించే దేశాలు తీవ్ర ఆర్థిక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ ఇటీవల హెచ్చరించారు. ఇరాన్‌ను ఒంటరిని చేసి ఓడించేందుకు మిత్రదేశాలన్నీ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, ఇరాన్ ఎప్పటికీ అణు ఆయుధాలను సమకూర్చుకోకూడదని స్పష్టం చేశారు. అయితే, ఇటువంటి విఫల విధానాల వల్ల అమెరికాకు మరిన్ని పరాజయాలు తప్పవని ఇరాన్ దీటుగా సమాధానమిచ్చింది.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి.. అగ్రనేతల ఘన నివాళి..

ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించుకోతగినది అని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు.

**గుడ్‌విల్ డే..**

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ (గుడ్‌విల్ డే) జరుపుకుంటారు. ఈ రోజు మాజీ ప్రధాని ప్రతిపాదించిన విలువలను స్మరించుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యువతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్‌గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయాలు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.

## సీబీఎస్ఈ 3 భాషల విధానం అమలు పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

సీబీఎస్ఈ పాఠశాలల్లో మూడు భాషల విధానం అమలు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ విద్యా విధానం అమలును తాము వ్యతిరేకించడం లేదని, అయితే దీనిని అమలు చేసే క్రమంలో విద్యార్థులపై అనవసర ఒత్తిడి పడకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ విధానం యొక్క ఆచరణాత్మక అమలుపై మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయాలని బోర్డును ఆదేశించింది.

**ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రధానాంశాలు:**

ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతి వచ్చేసరికి మూడో భాషలో కూడా తప్పనిసరిగా బోర్డు పరీక్ష రాయాల్సి రావడం వారిపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందని ధర్మాసనం అభిప్రాయ పడింది. అందుకే ప్రస్తుత 6వ తరగతి విద్యార్థులకు ఈ మూడో భాష బోర్డు పరీక్ష నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అంతేకాకుండా, ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా అనే విషయాన్ని కూడా పునరాలోచించాలని స్పష్టం చేసింది. పాఠశాలల్లో సరిపడా అర్హత కలిగిన ఉపాధ్యాయుల లభ్యత, పాఠ్యపుస్తకాలు, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థులు ఇన్నాళ్లుగా చదువుతున్న విదేశీ భాషల కాంబినేషన్ దెబ్బతినకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది.

## రూపురేఖలు మార్చే జహీరాబాద్ ప్రాజెక్ట్.. 2028 నాటికి పూర్తికి తెలంగాణ సర్కార్ ప్లాన్

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ద్వారా తయారీ రంగంలో సుమారు రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని, తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2028 మార్చి నాటికి ఈ ప్రాజెక్టులో కీలకమైన మౌలిక సదుపాయాలను పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇటీవల వెల్లడించారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు సంస్థ (నిక్డిట్) సమావేశంలో తెలంగాణ సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్న మంత్రి ఈ వివరాలను తెలిపారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉండేలా జహీరాబాద్ పారిశ్రామిక నగరాన్ని తీర్చిదిద్దేందుకు మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేస్తున్నట్లు ఆయన వివరించారు. హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలో మొదటి దశలో 3,245 ఎకరాల్లో జహీరాబాద్ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 17 గ్రామాల్లో 12,635 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ఇండస్ట్రియల్ నోడ్, జహీరాబాద్ పట్టణానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ (ఎన్ఐసీడీసీ) నివేదిక ప్రకారం, మొదటి దశలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 1,90,031 ఉద్యోగాల కల్పనను అంచనా వేశారు. ప్రాజెక్ట్ మాస్టర్ ప్లాన్ ప్రకారం. సుమారు 1,939ఎకరాలను పారిశ్రామిక అవసరాలకు, 55 ఎకరాలను లాజిస్టిక్స్ కోసం, 607 ఎకరాలను పచ్చదనం కోసం కేటాయించారు. మిగిలిన భూమిని రోడ్లు, వాణిజ్య, నివాస భవనాలు, ఇతర ప్రజా సౌకర్యాల కోసం వినియోగించనున్నారు. ఆటోమొబైల్స్, రవాణా పరికరాలు , ఎలక్ట్రికల్ పరికరాలు, లోహాలు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలను ఇక్కడ ప్రధానంగా ప్రోత్సహించనున్నారు. జాతీయ రహదారి 65కి సమీపంలో ఉండటం పరిశ్రమలకు రవాణా సౌకర్యాన్ని పెంచనుంది. ఇదే స్మార్ట్ సిటీలో హ్యుందాయ్ గ్రూప్ రూ.8,500 కోట్లతో గ్లోబల్ ఇన్నోవేషన్, రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుందని శ్రీధర్ బాబు గత జూన్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం ప్రకటించిన రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 2 లక్షల ఉద్యోగాలు కేవలం ప్రాజెక్ట్ లక్ష్యాలు మాత్రమేనని, ఇప్పటికే ఖరారైన ఒప్పందాలు కావని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'భారత్ ఉద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద రాష్ట్రంలోని నాలుగు పారిశ్రామిక పార్కులకు ఆర్థిక సహకారం అందించాలని శ్రీధర్ బాబు కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం మౌలిక వసతుల పనుల కోసం ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణ కాంట్రాక్టును జీవీపీఆర్-ఎస్ఆర్ఆర్ (జేవీ) సంస్థకు అప్పగించడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్టుతో జహీరాబాద్‌ను ఒక ప్రధాన తయారీ కేంద్రంగా మార్చాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.

## మూడు రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్..

దక్షిణ భారతదేశంలోని మూడు కీలక రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులను కలుపుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. మూడు రాష్ట్రాల రాజధానులు, ప్రధాన పారిశ్రామిక కేంద్రాలైన అమరావతి,బెంగళూరు, చెన్నైలను అనుసంధానించే ఈ హై-స్పీడ్ రైలు ప్రాజెక్టును చేపట్టాలని ఆయన సూచించారు. ముఖ్యంగా తన నియోజకవర్గమైన కుప్పం మీదుగా ఈ కారిడార్ వెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. గురువారం మహాబలిపురంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో చంద్రబాబు ఈ కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మూడు నగరాలు ఇప్పటికే పారిశ్రామికంగా, సాంకేతికంగా గణనీయమైన అభివృద్ధి సాధించాయని, వాటి మధ్య హై-స్పీడ్ రైలు మార్గం ఏర్పాటు చేస్తే రవాణా వ్యవస్థ బలోపేతమై ఆర్థికాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని, ఇది దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు. ఇదే సమావేశంలో, దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చంద్రబాబు మరో ముఖ్యమైన సూచన చేశారు. దక్షిణాదిలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం వంటి వాటిని ఉత్తర భారతదేశం లోని వారణాసి, అయోధ్య, చార్‌ధామ్ వంటి ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధా నిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటక రంగానికి కొత్త ఊపునిస్తుందని తెలిపారు. 2047 నాటికి భారత్‌ను 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలన్న జాతీయ లక్ష్యంలో దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా 31 శాతంగా ఉందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్లు, తమిళనాడు 2.6 ట్రిలియన్ డాలర్లు, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా ఎదిగే లక్ష్యాలు నిర్దేశించుకు న్నాయని, తద్వారా దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ఆయన వివరించారు. ఈ లక్ష్యాల సాధనకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

## శాసనమండలిలో మంత్రి లోకేశ్ ప్రవేశపెట్టిన 5 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 5 ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, మండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్యా, గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి రంగాలలో సంస్కరణల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించింది. శాసనమండలి సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. మండలి ఆమోదించిన బిల్లులలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు-2026, ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు ఉన్నాయి. వీటితో పాటు ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల (ఉపాధ్యాయుల కేడర్ లో రిజర్వేషన్) సవరణ బిల్లులను కూడా సభ ఆమోదించింది. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఏపీ ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లులకు సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

## ఉచిత పథకాల పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం..

తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిరాకరించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం... పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది. అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించి, ఆ ఆదాయంతో సంక్షేమం చేపట్టవచ్చని సూచిస్తూ, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

### మంత్రి పొంగులేటి క్షమాపణ చెప్పడం సిగ్గుచేటు

సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ఏ భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాలని ఇటీవల హైకోర్టు వ్యాఖ్యలు చేసిందన్నారు. ఎవరి ఇళ్లు ఎప్పుడు నిషేధిత జాబితాలోకి వెళు ్తందో అని ప్రజలు భయపడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

### పాలిటెక్నిక్‌ల విలీనం పై మంత్రి వివేక్ కీలక వ్యాఖ్యలు

ఇటీవల స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్‌ల విలీనంపై నెలకొన్న అపోహలకు మంత్రి వివేక్ వెంకటస్వామి తెరదించారు. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనంపై కొందరు అపోహలు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. పాలిటెక్నిక్‌లను మరింత అప్‌గ్రేడ్ చేసి, విద్యార్థులకు మెరుగైన నైపుణ్య శిక్షణ అందించాలనే ఉద్దేశంతోనే వాటిని స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. బ్లూ కాలర్ ఉద్యోగాల్లోనూ తెలంగాణ యువత ముందుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలిటెక్నిక్ కాలేజీల లెక్చరర్లు, సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగు తారని, వారి సర్వీసు భద్రతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. డిప్యూటేషన్, బదిలీల విధానంలోనూ ఎలాంటి మార్పులు ఉండవని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసినప్పటికీ పాలిటెక్నిక్ ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, విద్యార్థులు ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ పొందే విధానం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే పాలిసెట్‌ను కూడా కొనసాగిస్తామని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, లెక్చరర్లకు విలీనంతో మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థులకు రూ.2 వేల స్టైఫండ్ అందించే అంశంపై కూడా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. వరంగల్‌లో విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించిన సీఐపై చర్యలు తీసుకుని బదిలీ చేశామని తెలిపారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలిటెక్నిక్ కాలేజీలను పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థుల ఆందోళనల వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందని ఆరోపించిన మంత్రి.. రాజకీయ పార్టీల తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు, ఉద్యోగులు నమ్మవద్దని సూచించారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## టీచర్ నియామకాల్లో ఆలస్యం విద్యాహక్కుకే భంగం!



ఒక ప్రజాప్రతినిధి పదవి ఖాళీ అయితే ఆ స్థానాన్ని ఆరు నెలల్లోపు భర్తీ చేయాలని చట్టం చెప్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రాతినిధ్యం లేకుండా ఎక్కువ కాలం ఉండకూడదన్న భావన దీనికి ఆధారం. అయితే ఉపాధ్యాయుల ఖాళీల విషయంలో మాత్రం ఇలాంటి తొందర ఎవరికీ లేదు!ఉపాధ్యాయులు పదవీ విరమణ చేసినా, బదిలీ అయినా, లేదా ఇతర కారణాలతో ఉద్యోగం నుంచి వైదొలిగినా ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయరు. మళ్ళీ నియామకాల ప్రక్రియ మొదలయ్యేదాకా విద్యార్థులు ఏళ్ళ తరబడి ఎదురుచూడాల్సిందే. ఈ ఆలస్యానికి మూల్యం చెల్లిస్తున్నది పిల్లలే. ప్రభుత్వ పాఠశాలలపైనే పూర్తిగా ఆధారపడే పేద, అట్టడుగు వర్గాల పిల్లలు దీనివల్ల చాలా నష్టపోతున్నారు. ఒక టీచర్ పోస్టు ఖాళీగా ఉండటం అంటే కేవలం ఒక ఉద్యోగం ఖాళీగా ఉండటం కాదు; అది పిల్లల విద్య హక్కుకు ఏర్పడిన ఖాళీ.

ఉపాధ్యాయుల కొరత వల్ల తరగతులను విలీనం చేయడం, ఒకే ఉపాధ్యాయుడు అనేక తరగతులకు బోధించడం, మిగిలిన ఉపాధ్యాయులపై అదనపు భారం పడటం, బోధన సమయం తగ్గిపోవ డం, చదువు ఫలితాలు దెబ్బతినడం వంటి పరిస్థితులు ఏర్పడు తున్నాయి. మొదటి తరం చదువుకునే విద్యార్థులు, వెనుకబడిన ప్రాంతాల పిల్లలు దీనివల్ల మరింత వెనుకబడుతున్నారు.

చాలామంది తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపడానికి ఇది కూడా పెద్ద కారణం. ప్రైవేట్ పాఠశాలలు తమ ఉపాధ్యాయ--విద్యార్థుల నిష్పత్తిని కాపాడుకోవడంలో శ్రద్ధ చూపుతాయి. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు.

ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచిన కారణంగా మూడేళ్ల పాటు పదవీ విరమణలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఆ విరామం ముగియడంతో ఇప్పుడు ప్రతి సంవత్సరం వివిధ కేడర్లలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్నారు. ఒక లెక్క ప్రకారం నెలకు 400--500 మంది టీచర్లు రిటైర్ అవుతున్నారు. దీనివల్ల నిరంతరం కొత్త ఖాళీలు ఏర్పడుతున్నాయి. ముప్పైమంది విద్యార్థులకు ఒక టీచర్ అనుకున్నా సంవత్సరానికి దాదాపు లక్షా ముప్పైవేల మంది విద్యార్థులు బోధనకు దూరం అవుతున్నారని అర్థం. దీని ప్రభావం వల్లనే విద్యపరంగా తెలంగాణ జాతీయ సూచికలలో వెనుకబడి ఉంది. జిల్లాల వారీగా చూస్తే జాతీయ స్థాయిలో బిహార్ లాంటి వెనుకబడిన రాష్ట్రాల జాబితా సరసన తెలంగాణ జిల్లాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి.విద్యా హక్కు చట్టం--2009 ప్రకారం, పాఠశాలలు కఠినమైన విద్యార్థి--ఉపాధ్యాయ నిష్పత్తులను, వృత్తిపరమైన ప్రమాణా లను తప్పనిసరిగా పాటించాలి. అన్ని పాఠశాలల్లోని మొత్తం ఉపా ధ్యాయ ఖాళీలు సాధారణంగా మంజూరైన సంఖ్యలో 10శాతాన్ని మించకూడదు. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఖచ్చితంగా నిషేధం. ఐనా చట్టానికి విరుద్ధంగా తెలంగాణలో సింగిల్ టీచర్ స్కూళ్ళు సుమారు 5వేలు ఉన్నాయి. క్రమంగా అవి జీరో ఎనరోల్‌మెంట్‌గా రూపాంతరం చెంది బడిని మూసివేయాలన్న ఆలోచనకు దారితీస్తాయి. బడికి సరిపడా టీచర్లను ఇవ్వరు. టీచర్లు లేరని పిల్లలు తగ్గుతారు. పిల్లలు తగ్గారని ఇంకో టీచర్‌ను తీస్తారు. పిల్లలు మరింత తగ్గి అది సింగల్ టీచర్ బడి అవుతుంది. అప్పుడు జీరో ఎన్‌రోల్‌మెంట్ పేరు చెప్పి ఆ స్కూల్‌ను మూసేస్తారు! గత కొన్నేళ్ళుగా సాగుతున్న ఈ విష వలయానికి ముగింపు పలికి, విద్యా విధాన లోపాలను సరిచేయాలి.

తెలంగాణను పక్క రాష్ట్రాలతో పోల్చుకోవడం కాదని అమెరికా, బ్రిటన్‌లతో పోల్చుకోవాలని పోటీ పడుతున్నామని గత ప్రభుత్వంలో ఉన్నవాళ్ళు, ఈ ప్రభుత్వంలో ఉన్నవాళ్ళు కూడా చెప్తుంటారు. మరి ఆ దేశాల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ విధానం నుంచి కూడా పాఠాలు నేర్చుకోవాలి కదా! అమెరికా, బ్రిటన్ దేశాల్లో ఉపాధ్యాయ ఖాళీలను కేవలం పరిపాలనా అంశంగా కాకుండా పిల్లల అభ్యాస హక్కుకు సంబంధించిన అత్యవసర అంశంగా పరిగణిస్తారు. ఖాళీ ఏర్పడిన వెంటనే భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటారు. ఈ రెండు దేశాల్లో జిల్లా లేదా స్థానిక స్థాయిలో అర్హులైన ఉపాధ్యాయుల జాబితాలు (పూల్‌లు) అందుబాటులో ఉంటాయి. పాఠశాలలు తమ అవసరాలకు అనుగుణంగా ఈ జాబితా నుంచి ఉపాధ్యాయులను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. అర్హులైన శాశ్వత ఉపాధ్యాయులు వెంటనే అందుబాటులో లేకపోతే తాత్కాలిక లేదా ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను నియమిస్తారు. దీంతో ఒక్క తరగతి గది కూడా ఎక్కువ కాలం ఉపాధ్యాయుడు లేకుండా ఉండదు.

ప్రజాప్రతినిధుల ఖాళీలను భర్తీ చేయడానికి ఉన్న కాలపరిమితి మాదిరిగానే ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి కూడా ఒక స్పష్టమైన విధానం అవసరం. ఖాళీ ఏర్పడిన ఆరు నెలల్లోపు పోస్టులను భర్తీ చేయడం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలి. శాశ్వత నియామకాలు పూర్తయ్యే వరకు తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

# రాష్ట్రంలో ఎన్ని రాజకీయ పార్టీలు ఏర్పడినా దళితులకు రాజ్యాధికారం వస్తుందా?

**-రాజ్యాధికారంలేని జాతులు అంతరించిపోతాయి**
**-రాజ్యాధికారం ప్రాముఖ్యత**
**-హక్కుల రక్షణ : అధికారం ఉంటేనే చట్టాలు తమకు అనుకూలంగా ఉంటాయి**
**-ఆత్మగౌరవం సమాజంలో సమాన గౌరవం లభిస్తుంది**
**-అభివృద్ధి సంపద మరియు వనరుల పంపకం సరిగ్గా జరుగుతుంది.**
**-అస్తిత్వం జాతి గుర్తింపు నిలబడుతుంది.**

శ్రీశైలం ఆగస్టు 20 వార్త సాక్ష్యం

రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ఎన్నో ఏర్పడుతున్నాయి. కొత్త సిద్ధాంతాలు, కొత్త నినాదాలు, కొత్త హామీలతో ప్రజల ముందుకు వస్తున్నాయి. అయితే ఒక ముఖ్యమైన ప్రశ్న మాత్రం మన ముందుంది

**-రాజకీయ పార్టీలు పెరిగినంత మాత్రాన దళితులకు రాజ్యాధికారం వస్తుందా?**

దళితులకు రాజ్యాధికారం అంటే కేవలం ఒక దళితుడు ఎమ్మెల్యే కావడం, ఎంపీ కావడం లేదా మంత్రి పదవి పొందడం మాత్రమే కాదు. పాలనలో నిర్ణయాలు తీసుకునే స్థాయిలో దళితులకు సముచితమైన రాజకీయ ప్రాతినిధ్యం, స్వతంత్ర నిర్ణయాధికారం, సామాజిక గౌరవం, ఆర్థిక సాధికారత కలగడమే నిజమైన రాజ్యాధికారం.

భారత రాజ్యాంగం దళితుల రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రత్యేక రక్షణలు కల్పించింది. లోక్‌సభలో, రాష్ట్ర శాసనసభల్లో షెడ్యూల్డ్ కాస్ట్స్‌కు జనాభా నిష్పత్తికి దగ్గరగా సీట్లు రిజర్వు చేయాలని రాజ్యాంగంలోని 330, 332 అధికరణాలు నిర్దేశిస్తున్నాయి. (Election Commission of India)

అయితే రిజర్వ్‌డ్ సీట్లు ఉండటం మాత్రమే రాజ్యాధికారానికి హామీ కాదు. ఎన్నికల్లో దళిత ఓటు కీలకమైనప్పటికీ, ఆ ఓటు ఎవరి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడుతోంది? దళిత ప్రజల సమస్యలను ఎవరు విధానాలుగా మార్చుతున్నారు? దళిత నాయకులకు పార్టీలు ఎంత స్వతంత్ర నిర్ణయాధికారం ఇస్తున్నాయి? అనే ప్రశ్నలు కూడా ముఖ్యమే.

రాజకీయ పార్టీలు దళితులను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, నాయకత్వంలో భాగస్వాములుగా చూడాలి. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు దళిత యువతకు, మహిళలకు, మేధావులకు, సామాజిక కార్యకర్తలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి. పార్టీ పదవుల్లో, నిర్ణయాత్మక కమిటీల్లో, విధాన రూపకల్పనలో వారి భాగస్వామ్యం పెరగాలి.

అలాగే దళిత సమాజం కూడా తమ రాజకీయ శక్తిని కేవలం ఎన్నికల సమయంలో గుర్తుచేసుకోకుండా, నిరంతరం సంఘటితంగా ఉపయోగించుకోవాలి. ఓటు ఒక ఆయుధం మాత్రమే కాదు---ఒక బాధ్యత కూడా. ఎవరు తమ హక్కుల కోసం నిలబడుతున్నారు? ఎవరు విద్య, ఉపాధి, భూమి, సామాజిక న్యాయం, భద్రత, ఆర్థిక అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు? అనే అంశాలను పరిశీలించి రాజకీయ నిర్ణయం తీసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా దళితుల రాజకీయ, సామాజిక అభ్యున్నతి కోసం చట్టపరమైన చర్యలు ఉన్నాయి. ఉదాహరణకు, 2019లో రాష్ట్రం దీజలు, ౹ాజలు, ౹ాలు, మైనారిటీలకు నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని చేసింది. (India Code)

అయితే చట్టాలు ఉండటం ఒక అడుగు మాత్రమే; వాటి సమర్థవంతమైన అమలు, దళితులకు వాస్తవ నిర్ణయాధికారం కల్పించడం మరింత ముఖ్యమైనది.

రాజ్యాధికారం ఎవరో ఒక పార్టీ ఇచ్చేది కాదు. ప్రజల రాజకీయ చైతన్యం, సంఘటిత శక్తి, ఓటు విలువ, నాయకత్వ సామర్థ్యం, నిరంతర పోరాటం ద్వారా సాధించుకోవాల్సిందే.

రాష్ట్రంలో ఎన్ని రాజకీయ పార్టీలు ఏర్పడినా, దళితులు విభజితంగా ఉంటే వారి రాజకీయ శక్తి బలహీనపడుతుంది. కానీ హక్కుల విషయంలో ఐక్యత, రాజకీయంగా చైతన్యం, నాయకత్వాన్ని ప్రశ్నించే ధైర్యం, తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవాలనే సంకల్పం ఉంటే పరిస్థితి మారుతుంది.

**-అందుకే అసలు ప్రశ్న "ఎన్ని రాజకీయ పార్టీలు ఉన్నాయి?" అనేది కాదు.**

"దళితుల ఓటు ఎవరి చేతిలో ఉంది? దళితుల రాజకీయ నిర్ణయం ఎవరు తీసుకుంటున్నారు? పాలనలో దళితులకు ఎంత నిర్ణయాధికారం ఉంది?" అనేదే అసలు ప్రశ్న.

రాజ్యాంగం ఇచ్చిన హక్కులను అవగాహన చేసుకొని, విద్యతో బలపడి, ఆర్థికంగా ఎదిగి, రాజకీయంగా సంఘటితమై, తమ ప్రతినిధులను ప్రశ్నిస్తూ ముందుకు సాగినప్పుడే దళిత రాజ్యాధికారం సాధ్యమవుతుంది.

పార్టీలు ఎన్నైనా ఉండొచ్చు...
జెండాలు ఎన్నైనా ఉండొచ్చు...
కానీ దళితుల రాజకీయ చైతన్యం ఒక్కటిగా బలపడితేనే
రాజ్యాధికారం దిశగా నిజమైన అడుగు పడుతుంది.



వ్యాసకర్త
కోడి మోహన్ రావు
న్యాయవాది
9441905999

# 'మట్టికాళ్ల మహారాక్షసి'కి బొద్దింకల సవాల్

ఇట్ ఈజ్ రైట్ టు రెబెల్' అనే ఈ వాక్యానికి కాలం చెల్లిందనుకునే వాళ్లకు, ఢిల్లీలో జూన్ 20న జంతర్ మంతర్ నుంచి భారత పార్లమెంట్ కొత్త భవనం మధ్య ఉన్న వీధులు గట్టి జవాబిచ్చాయి. సుమారు నెలరోజులుగా జంతర్ మంతర్ దగ్గర గుమిగూడిన వేలాదిమంది చాలా ప్రశాంతంగా జవాబిచ్చారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో, ప్రజాస్వామి కవాదుల మద్దతుతో యువత గుమిగూడిన సందర్భం అది. ప్రశాంతంగా, ఏ రకమైన ఉద్రిక్తతలు లేకుండా మొదలైన ఈ ఆందోళన పార్లమెంట్ మార్చ్ రోజు ఒక కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టింది. రాజ్య యంత్రాంగం, గోదీ మీడియా, అంధ భక్తుల సోషల్ మీడియా అన్నీ కుతుబ్ మినార్ పైకెక్కి-- ఈ కాక్రోచ్ జనతా పార్టీ వెనుక ఉన్నది పాకిస్థాన్ అని, సోరోస్ అనీ, అర్బన్ నక్సల్స్ అనీ దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో జరుగుతున్న ఉద్యమం ఇది.చాలా కాలం తర్వాత ఢిల్లీ వీధుల్లో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీచిన ఈ కొంచెం గాలి, కేవలం ఢిల్లీకే పరిమితం కాదని అర్థమవుతున్నది. ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర జరిగే ప్రదర్శనలు, సంసద్ మార్గ్ ప్రవేశం చేముందే ఆగిపోయే దృశ్యాల్ని చూసిన మనకు.. కొత్త పార్లమెంట్ ముందు వరకు ప్రదర్శనకారులు చేరుకుని అధికార పీఠాన్ని సవాలు చేయడాన్ని చూడడం ఒక కొత్త అనుభవం. న్యూఢిల్లీ ప్రాంతంలో ఇంటర్నెట్ నిలిపివేసి ఢిల్లీలో జరుగుతున్న నిరసన, దేశానికి తెలియకుండా చేసే ప్రయత్నం చేసినా, 'దేశ్‌బంధు' అనే చానెల్ లైవ్‌లో చూపించింది. మెట్రో స్టేషన్లను మూసివేసి ప్రదర్శన కారులు రోడ్లకెక్కొద్దని ఎన్ని చర్యలు తీసుకున్నా, సెంట్రల్ ఢిల్లీ వైపునకు ఢిల్లీలోని అన్ని వీధులు ప్రవాహంలా కదలడం రాబోయే కాలపు ప్రజా ఉద్యమాలకు సంకేతం.

మోదీ పొద్దున్నే పార్లమెంట్ ముందు నిలబడి 'దేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ఎక్కింది' అని చెప్పి లోపలికి వెళ్లి వర్షాకాల సమావేశాలు మొదలుపెట్టగానే, ఈ దేశ విద్యార్థులు, యువత 'ఉద్యమాల ఎక్స్‌ప్రెస్' ఎక్కి పార్లమెంట్‌కు చేరుకున్నారు. నాకు తెలిసి ప్రదర్శనకారులకు భయపడి పార్లమెంట్ గేట్లకు తాళాలు వేసిన సందర్భం ఇప్పటివరకు లేదు. పార్లమెంట్ భవనం లోపలి నుంచి పోలీసు బలగాలు తుపాకుల్ని బయటకు ఎక్కుపెట్టిన దృశ్యం కూడా కొత్తదే. పొద్దున్నే మోదీ మీడియాను ఉద్దేశించి 'బలమైన వాదనలు, బలమైన వాస్తవాలు' ఉంటే పార్లమెంట్ చర్చల్లో తుపానులు అవసరం లేదని చెప్పి వెళ్లగానే, భాజపా సర్కారుపై విద్యార్థి యువత ప్రదర్శన తుపానులా విరుచుకుపడింది.



పార్లమెం ట్ స్ట్రీట్‌లో, ఇంకొన్ని ప్రాంతాల్లో లాఠీచార్జీలో పదుల సంఖ్యలో ప్రదర్శనకారుల తలలు పగిలాయి. ఎన్నోచోట్ల బాష్పవాయు గోళాల్ని పేల్చినా విద్యార్థులు, యువత వెనక్కు తగ్గలేదు. అమిత్ షా ఆదేశాలతో నడిచే ఢిల్లీ పోలీసులు సోనమ్ వాంగ్‌చుక్‌ను దీక్షా స్థలం నుంచి మూట లా కట్టి ఎత్తుకుపోయి, ఏ శాంతిభద్రతల్ని మెరుగు పరుస్తున్నారో ప్రజలకు అర్థమైంది. దేశానికి అధికార కేంద్రమైన సెంట్రల్ ఢిల్లీ వీధులన్నీ పోలీస్, పారా మిలిటరీ బలగాలతో యుద్ధరం గంలా కనిపించాయి.

సోనమ్ వాంగ్‌చుక్‌ను ఎత్తుకుపోయిన తర్వాత జంతర్ మంతర్ దీక్షా స్థలంలో అప్పటివరకున్న విద్యామంత్రి 'ప్రధాన్' రాజీనామా డిమాండ్ 'ప్రధాని' మోదీ రాజీనామా డిమాండ్‌గా మారింది. విద్యామంత్రి ప్రధాన్ ఇప్పటివరకు రాజీనామా ఇవ్వకపోవటానికి కారణం మోదీ--షాల అపరిమిత అధికార అహంకారమనేది స్పష్టం. ఎందుకంటే, నేటి భారతదేశంలో నిర్ణయాలు చేసే ద్వయం వీళ్లే. తనది 'ఛప్పన్ ఇంచ్ కా సీనా' (యాభై ఆరు అంగుళాల విశాలమైన ఛాతీ) అని చెప్పుకునే మోదీ మనసులో నీట్ బాధితులపై కనికరం లేదు. ఈ పార్లమెంట్ మార్చ్ అనేది మోదీ, అమిత్ షాలకు ఈ దేశ విద్యార్థి, యువత చేసిన ధిక్కారం. ఈ మధ్యే చదువు పూర్తి చేసుకుని ఇండియా వచ్చిన అభిజీత్ దీప్కే... కాక్రోచ్ జనతా పార్టీని మొదలుపెట్టిన రోజుల్లో కొందరు ప్రజాస్వామిక వాదులు సైతం వాళ్లపై అనుమానాలు వ్యక్తం చేశారు. విద్యామంత్రి రాజీనామా డిమాండ్‌పై గట్టిగా నిలబడి, పార్లమెంట్ మార్చ్ నిర్వహించిన కాక్రోచ్ జనతా పార్టీ తన విశ్వాసాన్ని నిలుపుకున్నట్టే. ఎందుకంటే ఈ పన్నెండేళ్ల బీజేపీ పాలనలో ఆదివాసీ, దళిత, విప్లవ పోరాటాలతో సహా అన్నిటినీ అణచివేసి, ఒక ఫాసిస్ట్ పాలనను నెలకొల్పిన సందర్భంలో కేంద్ర ప్రభుత్వాన్ని సవాల్ చేస్తూ 'బొద్దింకలు' పార్లమెంట్ వరకు వెళ్లడం ఒక ఆశాకిరణం కాక మరేమిటి?

ఢిల్లీ వీధులు నిరసనకారుల నినాదాలతో మార్మోగుతూ ఉన్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, నీట్, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం స్పందిం చకపోతే... ఈ వర్షాకాల సమావేశాల్లో పార్లమెం టులో తుపానులు, దేశంలో ఉప్పెనలు వస్తాయి. ఇప్పటివరకు కాక్రోచ్ జనతా పార్టీ చేస్తున్న ఉద్యమాన్ని పట్టించుకోని ప్రతిపక్ష పార్టీలు సైతం, వారితో కలిసి ఉద్యమిస్తే తప్ప కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక రాజకీయాన్ని ఎదుర్కోలేవు. ఇది ప్రతిపక్షం తెలుసుకోకపోతే వారికే నష్టం.

జంతర్ మంతర్ ఒక ఖగోళశాస్త్ర వేధశాల. అక్కడ ఉన్న సామ్రాట్ యంత్రం అనే ఒక నిర్మాణం, కాలాన్ని లెక్కించేందుకు ఏర్పాటైంది. మెటఫరికల్‌గా చూస్తే ఢిల్లీలో ఉన్న జంతర్ మంతర్ ఎన్నో ఉద్యమాలను భారత రాజకీయ కాలమానంలో రికార్డు చేసింది. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మహిళా రెజ్లర్లు చేసిన పోరాటాన్ని మోదీ యంత్రాంగం, మీడియా సహాయంతో అణచివేసింది. ప్రజా ఉద్యమాలకు మళ్లీ సమయం వచ్చిందని సామ్రాట్ కాలయంత్రం ఇప్పుడు చెబుతున్నది.

VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# నిరుపేదల ప్రాణాలకు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల భరోసా





**-మున్సిపల్ కార్మికుడు రాజేంద్ర గుండెకు ఉచితంగా ఇంజక్షన్**

**-అర్ధరాత్రైనా అత్యవసర వైద్యంలో తక్షణ స్పందన..**

**సూపరిండెంట్ డాక్టర్ రాయుడు**

ఆత్మకూరు ఆగస్టు 20 వార్త సాక్ష్యం

గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్న మున్సిపల్ కార్మికుడు రాజేంద్రకి అర్ధరాత్రి సమయంలోనూ సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు తక్షణమే స్పందించి అత్యవసర చికిత్స అందించారు. గుండె సమస్యకు అవసరమైన ఖరీదైన రూ. 54 వేల రూపాయల ఇంజక్షన్‌ను ప్రభుత్వ వైద్యశా లలోనే డ్యూటీ డాక్టర్ జగదీష్ తోపాటు డ్యూటీ నర్స్ రజియా ఇంజక్షన్ వేసి మెరుగైన వైద్యం అందించారు. కార్పొరేట్ ఆసుప త్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలో అత్యవసర సేవలు అందు బాటులో ఉండటంతో నిరుపేద కుటుంబాలకు ఎంతో భరోసా కలుగు తోందని. రూ.54 వేల నుంచి లక్షల రూపాయల వరకు ఖర్చయ్యే గుండె చికిత్స ఇంజక్షన్లు ఉచితంగా అందించడం పేదలకు వరంగా మారింది. సూపరిం టెండెంట్ డాక్టర్ రాయుడు చూపుతున్న చొరవతో ప్రభుత్వ వైద్యశాలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. ఆత్మకూరు ప్రభుత్వ ఆసు పత్రిని కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాయుడు సేవలకు నిరుపేద ప్రజలనుండి ప్రశంసలు వెదజల్లుతున్నాయి. నిరుపేదలకు అండగా నిలిచే వైద్యుడు ఆత్మకూరు మండల ప్రజలకు దొరకడం అదృష్టంగా భావించవచ్చు.. అటువంటి వైద్యుడు నిండు నూరేళ్ల పాటు చల్లగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కొనసాగించాలి

**-కెవిపిఎస్ ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్**

ఆత్మకూరు ఆగస్టు 20 వార్త సాక్ష్యం



దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కొనసాగించాలని కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు వి యేసు రత్నం, నాయకులు ఎన్ సంపత్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, సిఐటియు పట్టణ కార్యదర్శి డి రామ్ నాయక్, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. గురువారం నాడు సుదర్శన వర్మ స్మారక భవనంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో పి. సుధాకర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రైస్తవులు అనే పేరుతో దళితులకు ఉన్న రిజర్వేషన్లను తొలగించడం దుర్మార్గం అన్నారు. సామాజిక సమానతలు ఆర్థిక దోపిడీ రాజకీయ అసమానతలు నేటి కి కొనసాగుతున్నాయని వాటిని రూపుమాపేందుకే భారత రాజ్యాంగంలో దళితులకు రిజర్వేషన్లను కల్పించారని అన్నారు. భారత రాజ్యాంగం అందరికీ మత స్వేచ్ఛను కల్పించిందని ఎవరు ఏ మతాన్ని అయినా ఆచరించవచ్చని మతాన్ని అడ్డుగా పెట్టుకుని ఎస్సీల రిజర్వేషన్లపై దాడులు చేయడం దుర్మార్గం అన్నారు. సామాజిక శంఖారావం పేరుతోటి కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సర్వేలు నిర్వహిస్తున్నామని ఇప్పటికే చాలా గ్రామాలలో దళితులకు స్మశానవాటికలు లేవు పున్నయ్య కమిషన్ ఆధారంగా వచ్చిన జీవో నెంబర్ 1235 ను ప్రభుత్వాలు అమలు జరపడం లేదని ఈ జీవో ప్రకారం ప్రతి గ్రామంలో దళితులకు రెండు ఎకరాల స్మశాన స్థలాన్ని కేటాయించాలని అన్నారు. దళితపేటలో మౌలిక సదుపాయాలు నేటికీ కరువయన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ప్రకారం దళిత కాలనీల అభివృద్ధికి పాలకవర్గాలు నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. సమాజంలో అంటరానితనం ఆర్థిక సామాజిక అసమానతలు కొనసాగినంత కాలం రిజర్వేషన్లను ఎస్సీ లందరికీ కొనసాగించాలని దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించేందుకు అవసరమైతే రాజ్యాంగ సవరణ కూడా చేయాలని అందుకు దళిత గిరిజనులే కాకుండా సామాజిక స్పృహ కలిగినటువంటి ప్రతి ఒక్కరూ ఈ పోరాటానికి మద్దతు ఇచ్చి ముందుకు నడిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఏ రణధీర్, నాగేశ్వర రావు, సద్దాం, గణపతి, ప్రతాప్, సామేలు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు తాగు సాగు నీటి పోరాటం కోసం త్వరలో కార్యాచరణ ప్రకటిస్తాం





**-తెలంగాణ నీటి దోపిడీని చంద్రబాబు అడ్డుకోలేకున్నారు**

**-ఓటుకు నోటు కేసు లో దొరికి చంద్రబాబు అమరావతికి మకాం మార్చారు**

**-శ్రీశైలం నుండి నీటిని విడుదల చేసి రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోవాలి**

**-మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విజ్ఞప్తి**

నంద్యాల ఆగస్టు 20 వార్త సాక్ష్యం

వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాయలసీమ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవడానికి శ్రీశైలం ప్రాజెక్ట్ నుండి వెలుగోడు, గోరుకల్లు, అవుకు మరియు మైలవరం రిజర్వాయర్లకు వెంటనే నీటిని విడుదల చేయాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల రైతులతో నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీరు, సాగునీరు అందిం చేందుకు చేపట్టిన కార్యాచరణ ప్రణాళికపై రైతుల సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 857 అడుగుల మేర నీటి నిల్వలు ఉండి, 110 టీఎంసీల నీటితో ప్రాజెక్టు నిండుగా ఉన్నప్పటికీ దిగువకు నీరు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. మునుపెన్నడూ లేని విధంగా రైతులు నీటికై ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనీసం ఆరుతడి పంటలను కాపాడుకోవడానికి, పశువుల తాగునీటి అవసరాలు తీర్చడానికైనా ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం ఎడమ గట్టు నుంచి రోజుకు 4 టీఎంసీల నీటిని తరలిస్తూ, దాదాపు 15 ప్రాజెక్టులకు నీటిని ఇస్తున్నా ఏపీ ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు, తెలంగాణ సీఎంతో చేసుకున్న చీకటి ఒప్పందం వల్లే రాయలసీమకు ఈ నీటి కష్టాలు వచ్చాయని విమర్శించారు. ప్రధానంగా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, శ్రీశైలం నుండి దిగువ రిజర్వాయర్లకు వెంటనే నీటిని విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన పలువురు రైతు నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

# బహిరంగ మద్యానికి చెక్



ముండ్లమూరు ఆగస్టు 20 వార్త సాక్ష్యం

ముండ్లమూరు మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఎస్సై కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బహిరంగంగా మద్యం సేవించే ప్రదేశాల నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ప్రాంతాలను పోలీసులు గుర్తించి శుభ్రం చేశారు. అక్కడ లభించిన మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలను తొలగించి దహనం చేశారు. ప్రజలకు ప్రశాంతమైన, సురక్షిత వాతావరణం కల్పించేందుకు బహిరంగంగా మద్యం సేవించడంపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# బృందావన్ గార్డెన్స్ రోడ్డుకు వేగం

**-విస్తరణ చివరి దశ.. రెండు రోజుల్లో డ్రైన్ల పనులు పూర్తి చేయాలని ఆదేశం**



గుంటూరుఆగస్టు 20 వార్త సాక్ష్యం

బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తికానున్న నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విస్తరణ పనులు చివరి దశకు చేరుకున్నందున రోడ్డు నిర్మాణాన్ని ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని ఎస్ఈని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను తరలించాల్సి ఉన్నందున సీపీడీసీఎల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. డ్రైన్ నిర్మాణం పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఈఈని ఆదేశించారు. కల్వర్టు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించాలని, ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అనంతరం పట్టాభిపురం మెయిన్ రోడ్డులో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసిన భవనాన్ని కమిషనర్ పరిశీలించారు. బిల్డింగ్ మ్యాప్, సెట్‌బ్యాక్, సెల్లార్ తదితర అంశాలను తనిఖీ చేశారు. రోడ్లపై ఉన్న నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం అమలులో ఉన్నందున ఉల్లంఘనలు గుర్తిస్తే స్వచ్ఛ యాప్ ద్వారా జరిమానాలు విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కొల్లూరులో 13 మందికి వైద్య సాయం



వేమూరు ఆగస్టు 20 వార్త సాక్ష్యం

కొల్లూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్య బాధితులు 13 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మొత్తం రూ.5,30,852 ఆర్థిక సహాయం మంజూరైంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితుల వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులను వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సిఫార్సు లేఖలతో ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపగా, అధికారులు పరిశీలించి అర్హులైన వారికి ఆర్థిక సహాయం మంజూరు చేశారు. గాజులలంక గ్రామానికి చెందిన గాజుల మల్లేశ్వరికి రూ.1,22,979, కొల్లూరు గ్రామానికి చెందిన చందోలు నాగేశ్వరరావుకు రూ.60,195, సోమరౌతు వెంకట్రావుకు రూ.55,250, చినపులివర్రు గ్రామానికి చెందిన పాచిగళ్ల రత్నసురమణికి రూ.43,836, మిరియాల నాగలక్ష్మికి రూ.23,920, పాచిగళ్ల సుమన్‌కు రూ.28,155 చొప్పున మంజూరయ్యాయి. పెసర్లంక గ్రామానికి చెందిన చావలి అభిషేక్‌కు రూ.30,000, అన్నమనేని మణికంఠకు రూ.25,341, కిష్కిందపాలెం గ్రామానికి చెందిన కొల్లి వంశీకృష్ణకు రూ.21,346, దొక్కు లక్ష్మీకుమారికి రూ.40,503, తాడిగిరిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి శ్యామలకు రూ.21,986, పోతర్లంక గ్రామానికి చెందిన బొల్లెద్దు ధనకుమారికి రూ.23,541, క్రాప గ్రామానికి చెందిన మట్టా శివకు రూ.33,800 చొప్పున ఆర్థిక సహాయం అందింది. మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారులకు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు వైద్య చికిత్స సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని తెలిపారు. పేదల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వేమూరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. తమకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ప్రత్యేక చొరవ తీసుకుని సిఫార్సు చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## డబ్బుల బెదిరింపులతో బలవన్మరణయత్నం

సత్తెనపల్లి ఆగస్టు 20 వార్త సాక్ష్యం



పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని నాగన్నకుంటకు చెందిన కుంచాల నాగమణి (40) మనస్తాపంతో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు వైద్యులు సిఫారసు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగమణి చర్చి నిర్మాణం నిమిత్తం పెదాల వెంకటేశ్వరమ్మకు సుమారు రూ.10 లక్షల నగదుతో పాటు బంగారం ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటన జరిగి దాదాపు రెండున్నర సంవత్సరాలు కావడంతో తన డబ్బు, బంగారం తిరిగి ఇవ్వాలని నాగమణి కోరినట్లు తెలిపారు. అయితే వెంకటేశ్వరమ్మ తన సోదరుడు నరసరావుపేటలో పెద్ద రౌడీషీటర్ అని, డబ్బులు అడిగితే అతనికి చెప్పి చంపిస్తానంటూ బెదిరించినట్లు నాగమణి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## ఆలయ నిర్మాణానికి మహేంద్రనాథ్ హామీ



చీరాల ఆగస్టు 20 వార్త సాక్ష్యం

కటారి వారిపాలెం గ్రామంలో జాలేరమ్మతల్లి, దుర్గమ్మతల్లి, పోలేరమ్మతల్లి అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ, దేవాలయాలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ఆలయాల నిర్మాణంతో గ్రామంలో భక్తి భావం మరింత పెంపొందడంతో పాటు సామాజిక ఐక్యత, గ్రామాభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని మహేంద్రనాథ్ హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలకు అనుగుణంగా ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని ఆయన అన్నారు.భూమి పూజ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అగ్నిబాధితులకు అండగా మహేంద్రనాథ్ ఆపన్నహస్తం



చీరాలఆగస్టు 20 వార్త సాక్ష్యం

దేవినూతల గ్రామంలో ప్రమాదవశాత్తు సంభవించిన అగ్నిప్రమాదంలో ఇళ్లు దగ్ధమై సర్వం కోల్పోయిన మూడు కుటుంబాలను చీరాల నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ పరామర్శించారు. కష్టకాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తూ వారికి భరోసా కల్పించారు.అగ్నిప్రమాదంలో ఇళ్లు, ఇంటి సామగ్రి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.1.50 లక్షల ఆర్థిక సాయాన్ని మహేంద్రనాథ్ అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ.. అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితులకు ఇళ్ల నిర్మాణం, ఇతర అవసరాల కోసం ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని త్వరితగతిన అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.పదవులు, రాజకీయ బాధ్యతలు అనుభవించడంతో పాటు ఆపదలో ఉన్న పార్టీ శ్రేణులకు అండగా నిలవడం, వారి భుజం తట్టి ధైర్యం చెప్పడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని మహేంద్రనాథ్ తన చర్యతో చాటిచెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉద్యోగ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి





**-పరీక్ష నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

కర్నూలు, ఆగస్టు 20 వార్త సాక్ష్యం

విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఈ) ఉద్యోగాల భర్తీకి నిర్వహించనున్న పరీక్షను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో విద్యుత్ శాఖలో ూజుజు ఉద్యోగ పరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...విద్యుత్ శాఖలోని వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి ఆగస్టు 23 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ బాధ్యతలను ుజూ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) చేపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.28 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, కర్నూలు జిల్లాలో సుమారు 4,982 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని విద్యుత్ రంగంలోని వివిధ సంస్థల్లో ఖాళీల భర్తీకి నిర్వహిస్తున్న ఈ నియామక ప్రక్రియలో APSPDCL, CPDCL, EPDCL, GENCO, TRANSCO సంస్థల్లో పోస్టులు ఉన్నాయని మొత్తం 630 పోస్టులకు నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, పొరపాట్లకు తావులేకుండా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్, రద్దీ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష సమయం మొత్తం పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద హెల్త్ డెస్క్ ఏర్పాటు చేసి అత్యవసర ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ, ఇతర రవాణా సదుపాయాలను సమన్వయం చేసుకోవాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. మొబైల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని తెలిపారు. పరీక్ష హాలుకు వారికి కేటాయించిన సమయంలోపల హాజరు కావలసిందిగా కోరారు. ఇతర పోటీ పరీక్షలను నిర్వహించే సమయంలో అందిస్తున్న తరహాలోనే (ఎఈ )ఉద్యోగ పరీక్ష నిర్వహణకు కూడా అన్ని శాఖలు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖ అధికారులు తహసీల్దార్ల సమన్వయం చేస్తూ పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, పరస్పర సమన్వయంతో పనిచేసి అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశానికి ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్ , సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాఘవులు , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి , ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు , తహసిల్దారులు కర్నూలు రూరల్ మరియు కల్లూరు లు రమేష్ , ఆంజనేయులు , జిజిహెచ్ డి ఎస్ ఓ డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ట్రాన్సకో పర్సనల్ ఆఫీసర్ సంతోష్ , సబ్ ఇన్స్పెక్టర్ శేఖర్ రెడ్డి , అయాన్ డిజిటల్స్ మరియు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ప్రతినిధులు హాజరయ్యారు

## ఓటర్లకు నోటీసుల అందజేత (డెలివరీ) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి







**-యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**-కాలేజీల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఫారం-6 దరఖాస్తులను పెంచాలి**

**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్**

కర్నూలు, ఆగస్టు 20 వార్త సాక్ష్యం

ఓటర్లకు నోటీసుల అందజేత (డెలివరీ) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కలెక్టర్ లను ఆదేశించారు.గురువారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కలెక్టర్ లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశం పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ అత్యధికంగా పెండింగ్‌లో ఉన్న నియోజకవర్గాలను గుర్తించి, ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, సిబ్బందిని సమన్వయం చేస్తూ త్వరితగతిన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియతో పాటు ఫారం-6 దరఖాస్తుల డిస్పోజల్‌పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇందుకోసం కళాశాలల్లో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులు నిర్వహించాలని, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. అర్హత కలిగిన యువ ఓటర్లు పెద్ద సంఖ్యలో ఫారం-6 సమర్పించి ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఫారమ్--7, 8 దరఖాస్తుల పెండెన్సీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి జిల్లాలో చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియ గురించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరిస్తూ.. నోటీసుల పంపిణీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని 3 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విచారణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫారమ్‌లు 6, 7 ు 8 లకు సంబంధించి 24,000 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, రాబోయే 8--9 రోజుల్లో మొత్తం పెండెన్సీని పరిష్కరిస్తామన్నారు. NVSP మరియు బుక్ ఏ కాల్స్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక సదుపాయాల (Assured Minimum Facilities) కల్పనకు సంబంధించి తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి. వెంకటనారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు

## ఈవీఎం గోడౌన్ లు ఆకస్మిక తనిఖీ జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా





నంద్యాల ఆగష్టు 20 వార్త సాక్ష్యం

జిల్లాకు సంబంధించి ఈవీఎంల ను భద్రపరిచిన గోదాము వద్ద 24ఇ7 నిరంతరం నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మార్గదర్శకాలు ఆదేశాల మేరకు మంత్లీ తనిఖీల్లో భాగంగా గురువారం నంద్యాల జిల్లా మార్కెట్ యార్డ్ టెక్ గోడౌన్ నందు భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్, ఫైర్ సేఫ్టీ తదితరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేసారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్ నందు సంతకం చేశారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ రాము నాయక్, ఆర్ డి ఓ విశ్వనాథన్, ఎలక్షన్ డి టి మనోహర్, నంద్యాల తాసిల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 21 ఆగష్టు 2026

# ఎస్పీవై రెడ్డి ఆగ్రో ఇండస్ట్రీ సందర్శన









**-జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**

**నంద్యాల, ఆగస్టు 20 వార్త సాక్ష్యం**

ఎస్పీవై రెడ్డి ఆగ్రో ఇండస్ట్రీలో పరిశ్రమ కార్యకలాపాలు, ఉత్పత్తి ప్రక్రియ, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలను జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా గురువారం పరిశీలించారు.రెవెన్యూ, ఎక్సైజ్, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్, లేబర్ తదితర శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్, పరిశ్రమలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాలు, గ్రీనరీ, పరిశ్రమ నుంచి వెలువడే బై-ప్రొడక్ట్స్ నిర్వహణ, బై-ప్రొడక్ట్స్ ప్రాసెసింగ్ యూనిట్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. పరిశ్రమ కార్యకలాపాల వల్ల పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియ ంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.పరిశ్రమ నుంచి వెలువడే బై-ప్రొడక్ట్స్‌ను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహిస్తూ, వాటి ప్రాసెసింగ్ మరియు వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పరిశ్రమ పరిసరాల్లో గ్రీనరీని మరింత పెంచాలని, పరిశుభ్రతను నిరంతరం నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం






**-నంద్యాల డిఆర్ఓ రాము నాయక్**

**నంద్యాల, ఆగస్టు 20 వార్త సాక్ష్యం**

ఓటర్ల జాబితా సవరణ (సర్ ) ప్రక్రియలో భాగంగా భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జారీ చేసిన మార్గదర్శకాల అమలుపై గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో డి ఆర్ ఓ రాము నాయక్ సమావేశం గురువారం నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు సమావేశం జరిగింది.సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనగా, ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత అంశాలను వివరించారు. డి ఆర్ ఓ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలు, తుది ప్రచురణ తదితర అంశాలపై సమీక్షిస్తూ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 80,283 నోటీసులు జనరేట్ చేయగా, ఇప్పటివరకు 70,615 నోటీసులు పంపిణీ చేసినట్లు వివరించారు. ఇంకా 9,668 నోటీసులు పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే 12,142 విచారణలు పూర్తయ్యాయని, 57,473 విచారణలు పెండింగ్‌లో ఉన్నాయని, 12,587 కేసులు తుది ప్రచురణ కోసం పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 30, 2026 వరకు అందిన క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.అదేవిధంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పెండింగ్ ఫిర్యాదులు, 'బుక్ ఎ కాల్ విత్ బి ఎల్ ఓ,' అంశాలపై కూడా సమావేశంలో సమీక్షించారు

# మార్కాపురంలో 'రాజ్యాంగ పరిరక్షణ సభ' కరపత్రాల ఆవిష్కరణ

**-సెప్టెంబర్ 6న సభను జయప్రదం చేయాలని**

**-మాలల జె.ఎ.సి పిలుపు**

**నంద్యాల ఆగస్టు 20 వార్త సాక్ష్యం**

రాజ్యాంగ విలువల రక్షణే ధ్యేయంగా రాబోయే సెప్టెంబర్ 6వ తేదీన మార్కాపురం పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన "రాజ్యాంగ పరిరక్షణ సభ"ను జయప్రదం చేయాలని మాలల జె.ఎ.సి మార్కాపురం జిల్లా అధ్యక్షుడు మాలపోలు శాంతకుమార్ గురువారం పిలుపునిచ్చారు. యర్రగొండ పాలెం మాలల జె.ఎ.సి మరియు మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం 'రాజ్యాంగ పరిరక్షణ సభ'కు సంబంధించిన కరపత్రాలను మాలల ఐక్యవేదిక మాల మహానాడు నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలల జె.ఎ.సి మార్కాపురం జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టిముక్కల యోహాను మాట్లాడుతూ, దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణకు, సామాజిక న్యాయ సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. మాల సామాజిక వర్గంతో పాటు ప్రజాస్వామ్యవాదులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సెప్టెంబర్ 6న జరిగే ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. రాజ్యాంగ విలువలపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టడానికి మరియు మన హక్కులను



కాపాడుకోవడానికి ఈ సభ ఒక వేదిక కానుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాలల జె.ఎ.సి ప్రతినిధులు, మాల ఉద్యోగుల సంఘం నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొని కరపత్రాల ఆవిష్కరణను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మాలల జె.ఎ.సి మార్కాపురం జిల్లా ట్రెజరర్ కొండ్రు పిచ్చయ్య ,మాల ఐక్యవేదిక యర్రగొండపాలెం నియోజకవర్గం టెజరర్ మెండెం లక్ష్మయ్య, మాలమహానాడు సీనియర్ నాయకుడు మెడబలిమి అచ్యుత రావు, మాలమ హానాడు సీనియర్ నాయకుడు మెడబలిమి వేంకటేశ్వరరావు, యారగొండపాలెం నియోజకవర్గ మాల మహనాడు అధ్యక్షుడు తూమాటి రాంబాబు, మాలల జెఎసి యర్రగొండపాలెం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గుంటి రాంబాబు యర్రగొండపాలెం అంబేద్కర్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు విడుదల చేయాలి



**బాపట్లఆగస్టు 20 వార్త సాక్ష్యం**

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, ఎన్ఎంఆర్‌లు, గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎన్. బాబురావు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీల్లో కార్మికులకు నెలకు రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే వేతనాలు అందుతున్నాయని తెలిపారు. ఆ స్వల్ప వేతనాలు కూడా నెలల తరబడి చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొల్లూరు, చీరాల, వేటపాలెం తదితర మండలాల్లో పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులకు చట్టబద్ధంగా లభించాల్సిన వారాంతపు, ఇతర సెలవులను అమలు చేయాలని కోరారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న దుస్తులు, చెప్పులు, సబ్బులు, రక్షణ పరికరాలను వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 'సమాన పనికి సమాన వేతనం' అమలు చేసి మున్సిపల్ కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 2015, 2023 హైకోర్టు ఉత్తర్వుల మేరకు టెండర్ల పేరుతో కార్మికులను వేధించడం నిలిపివేయాలని బాబురావు స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు తక్షణమే పరిష్కరించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చొప్పర శ్రీనివాసరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, నాయకులు చెంచయ్య, వదనం, గట్టుపల్లి రాంప్రసాద్, కే. జక్రయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టీ. కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు కూటమి ప్రభుత్వం భరోసా



**దాచేపల్లి ఆగస్టు 20 వార్త సాక్ష్యం**

బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిరక్షించడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ బీసీ నేతలు పేర్కొన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను స్వాగతిస్తూ దాచేపల్లి పట్టణంలోని నారాయణపురం టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావం నుంచే బీసీల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన బీసీ సంక్షేమం, సాధికారత కార్యక్రమాలను చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని తెలిపారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కీలక ముందడుగని పేర్కొన్నారు.34 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతకు దోహదపడుతుందని నేతలు అన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలను టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని, బీసీల సంక్షేమం విషయంలో మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపిస్తోందని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని విమర్శించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీలకు అండగా నిలుస్తోందని, రానున్న రోజుల్లో బీసీల ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం మరిన్ని చర్యలు చేపడుతుందని నేతలు ధీమా వ్యక్తం చేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హర్షం వ్యక్తం చేస్తూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో దాచేపల్లి టౌన్ పార్టీ అధ్యక్షుడు షేక్ అహ్మద్ షరీఫ్, గురజాల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బొమ్మనబోయిన నాగరాజు యాదవ్, ఏఎంసీ చైర్మన్ బెల్లంకొండ భారతి బద్రి, దాచేపల్లి సొసైటీ బ్యాంక్ చైర్మన్ తంగళ్ల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కూటమి నేతలు, బీసీ, ఎస్సీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# బిజినెస్

# ఆగస్టులో టాటా కార్లపై భారీ డిస్కౌంట్లు.. ఏ మోడల్‌పై ఎంత తగ్గింపు అంటే?

**కర్వ్ ఈవీపై 2025 మోడల్ స్టాక్‌కు భారీ డిస్కౌంట్లు**
**టియాగో ఈవీ, పంచ్ ఈవీపై రూ.1.45 లక్షల వరకు ప్రయోజనాలు**
**నెక్సాన్ ఐసీఈపై రూ.90,000 వరకు ప్రయోజనాలు**
**ఆల్ట్రోజ్‌పై రూ.70,000 వరకు ప్రయోజనాలు**
**హారియర్, సఫారీపై రూ.70,000 వరకు ఆఫర్లు**

కారు కొనుగోలు చేయాలనుకునేవారికి టాటా మోటార్స్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఆగస్టు నెలలో పలు మోడళ్లపై భారీ డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, స్క్రాపేజ్ ప్రయోజనాలు, లాయల్టీ బెనిఫిట్స్‌ను అందిస్తోంది. ముఖ్యంగా కొన్ని ఎలక్ట్రిక్ కార్లపై రూ. 3.5 లక్షలకు పైగా ప్రయోజనాలు లభిస్తున్నాయి. అయితే ఈ ఆఫర్లు మోడల్, వేరియంట్, తయారీ సంవత్సరం, డీలర్‌షిప్, నగరం, అందుబాటులో ఉన్న స్టాక్, అర్హత వంటి అంశాలపై ఆధారపడి మారవచ్చు.

**టియాగో, టిగోర్‌పై ఇలా..**

కొత్తగా విడుదలైన టియాగో ఫేస్‌లిఫ్ట్‌పై ఆగస్టులో అధికారిక డిస్కౌంట్ లేదు. అయితే ప్రీ-ఫేస్‌లిఫ్ట్ టియాగో, టిగోర్ (శజు వేరియంట్ మినహా)పై ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి. రూ.15,000 వరకు క్యాష్ డిస్కౌంట్ లభిస్తోంది. రూ.10,000 ఎక్స్ఛేంజ్ బోనస్ లేదా రూ.15,000 స్క్రాపేజ్ బెనిఫిట్ ఉంది. ఎంపిక చేసిన టియాగో యూనిట్లపై రూ.5,000 ఫ్రీడమ్ సెలబ్రేషన్ బోనస్ కూడా అందిస్తున్నారు. ప్రీ-ఫేస్‌లిఫ్ట్ టియాగో ఈవీపై మాత్రం రూ. 1.45 లక్షల వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి.

**ఆల్ట్రోజ్‌పై రూ.70 వేల ప్రయోజనాలు**

టాటా ఆల్ట్రోజ్‌పై రూ. 35,000 వరకు క్యాష్ బెనిఫిట్స్ అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా రూ. 15,000 ఎక్స్ఛేంజ్ సపోర్ట్, రూ. 20,000 వరకు స్క్రాపేజ్ బెనిఫిట్ పొందే అవకాశం ఉంది. అర్హతను బట్టి మొత్తం ప్రయోజనం మరింత పెరగవచ్చు.

**పంచ్.. పంచ్ ఈవీపై భారీ తేడా**

స్టాండర్డ్ టాటా పంచ్‌పై ఆగస్టులో అధికారిక ఆఫర్లు లేవు. అయితే ప్రీ-ఫేస్‌లిఫ్ట్ పంచ్ ఈవీపై భారీ డిస్కౌంట్లు ఉన్నాయి. స్టాక్ అందుబాటులో ఉంటే రూ. 1.45 లక్షల వరకు ప్రయోజనాలు పొందవచ్చు.

**నెక్సాన్‌పై రూ.90 వేల వరకు..**

టాటా నెక్సాన్ ఐసీఈ వెర్షన్‌పై ఈ నెలలో ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయి. రూ. 55,000 వరకు క్యాష్ డిస్కౌంట్‌తో పాటు రూ. 15,000 ఎక్స్ఛేంజ్ సపోర్ట్, రూ. 20,000 వరకు స్క్రాపేజ్ బెనిఫిట్ లభిస్తుంది. మొత్తంగా రూ. 90,000 వరకు ప్రయోజనం పొందే అవకాశం ఉంది. నెక్సాన్ ఈవీపై కూడా రూ. 45,000 వరకు ఆఫర్లు ఉన్నాయి.

**కర్వ్‌పై భారీ ఆఫర్లు**




టాటా కర్వ్‌పై పలు రకాల ప్రయోజనాలను కంపెనీ అందిస్తోంది. రూ.30,000 క్యాష్ డిస్కౌంట్, రూ. 40,000 ఎక్స్ఛేంజ్ బోనస్, రూ. 45,000 స్క్రాపేజ్ బెనిఫిట్, రూ. 50,000 వరకు లాయల్టీ బోనస్ పొందొచ్చు. ఇక 2025 మోడల్ ఇయర్ కర్వ్ ఈవీ స్టాక్‌పై రూ. 3.5 లక్షలకు పైగా ప్రయోజనాలు లభిస్తున్నాయి.

**సియెర్రాపై కూడా ఆఫర్లు**

ఇటీవల మార్కెట్లోకి వచ్చిన టాటా సియెర్రా ఐసీఈపై రూ. 30,000 స్క్రాపేజ్ బెనిఫిట్‌తో పాటు ఎంపిక చేసిన వేరియంట్లపై లాయల్టీ ప్రయోజనాలు ఉన్నాయి. అయితే సియెర్రా ఈవీపై ప్రస్తుతం అధికారిక డిస్కౌంట్లు లేవు.

**హారియర్, సఫారిపై రూ.70 వేల వరకు**

టాటా హారియర్, సఫారిపై కలిపి రూ. 70,000 వరకు ప్రయోజనాలు లభించవచ్చు. రూ. 10,000 క్యాష్ డిస్కౌంట్, రూ. 25,000 ఎక్స్ఛేంజ్ బోనస్, రూ. 35,000 వరకు స్క్రాపేజ్ బెనిఫిట్ పొందొచ్చు. హారియర్ ఈవీపై రూ. 1 లక్ష వరకు ఫ్రీడమ్ సెలబ్రేషన్ ఆఫర్ ఉంది. రూ. 50,000 ఎక్స్ఛేంజ్ బోనస్, రూ. 75,000 వరకు స్క్రాపేజ్ బెనిఫిట్, ఇప్పటికే టాటా ఈవీ కలిగి ఉన్నవారికి రూ. 1 లక్ష వరకు లాయల్టీ బెనిఫిట్ లభిస్తుంది.

# క్రీడలు

## భారత్ నా రెండో ఇల్లు: ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్

**భారత్‌ను తన రెండో ఇల్లుగా అభివర్ణించిన షేన్ వాట్సన్**
**ఆస్ట్రేలియా కంటే ఇండియాలోనే ఎక్కువ ప్రేమ, మద్దతు పొందానన్న షేన్ వాట్సన్**
**సిడ్నీలో భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వ్యాఖ్యలు**
**ఐపీఎల్ తన కెరీర్‌కు కీలక సమయంలో అద్భుతమైన వేదికనిచ్చిందని వెల్లడి**

ఆస్ట్రేలియా మాజీ స్టార్ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ భారత్‌ను తన రెండో ఇల్లుగా అభివర్ణించాడు. సొంత దేశం ఆస్ట్రేలియా కంటే భారత్‌లోనే తనకు అత్యధిక ప్రేమాభిమానాలు, మద్దతు లభించాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సిడ్నీలోని భారత కాన్సులేట్ నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా వాట్సన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. భారత్‌లో క్రికెట్‌ను ఆరాధించే వారు సంఖ్య ఆస్ట్రేలియా కంటే ఎంతో అధికమని షేన్ వాట్సన్ పేర్కొన్నాడు. "భారత్‌లో నన్ను ఎవరూ పెద్దగా విమర్శించలేదని భావిస్తున్నాను. అక్కడ నాకు ఎప్పుడూ లభించే మద్దతు మరువలేనిది. ఆస్ట్రేలియాలో రాణించినప్పుడు ప్రశంసలు దక్కేవి, కానీ విఫలమైనప్పుడు విమర్శలు తప్పేవి కావు" అని వివరించాడు. భారత్‌తో పాటు ఇక్కడి ప్రజలతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని, తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌పై భారత్ చెరగని ముద్ర వేసిందని కొనియాడాడు. తాను 19 ఏళ్ల ప్రాయంలో తొలిసారి భారత్‌ను సందర్శించానని, అప్పటి నుంచి ఈ దేశం సాధిస్తున్న అద్భుత ప్రగతిని నిశితంగా గమనిస్తున్నానని వాట్సన్ గుర్తు చేసుకున్నాడు. తనకు భారతీయ శాఖాహార వంటకాలంటే ఎంతో మక్కువని కూడా వెల్లడించాడు. 2008లో ప్రారంభమైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), తన కెరీర్ కీలక దశలో ఉన్నప్పుడు ఒక అద్భుతమైన వేదికను కల్పించిందని కృతజ్ఞత చాటుకున్నాడు. కాగా, వాట్సన్ ఐపీఎల్‌లో 2008 నుంచి 2020 వరకు రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే.




## వివాదంలో బీసీసీఐ చీఫ్.. పుట్టిన తేదీపై ఫోర్జరీ ఆరోపణలు

**బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్‌పై ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు**
**పుట్టిన తేదీని తారుమారు చేశాడంటూ మాజీ అధికారి ఫిర్యాదు**
**ప్రాథమిక విచారణ జరపాలని పోలీసులను ఆదేశించిన జమ్మూ కోర్టు**
**సెప్టెంబర్ 3లోగా నివేదిక ఇవ్వాలని కోర్టు సూచన**
**పాఠశాల రికార్డుల్లో, వెబ్‌సైట్‌లో వేర్వేరు పుట్టిన తేదీలు ఉన్నట్టు ఆరోపణ**




భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు మిథున్ మన్హాస్ వివాదంలో చిక్కుకు న్నాడు. జూనియర్ స్థాయి క్రికెట్‌లో ప్రయోజనం పొందేందుకు తన పుట్టిన తేదీని తారుమారు చేశారనే ఆరోపణలపై అతడు ప్రాథమిక పోలీసు విచారణను ఎదుర్కొంటున్నాడు. ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలని జమ్మూలోని ఒక స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది.దజమ్మూ కశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ మాజీ గౌరవ సంయుక్త కార్యదర్శి సుదర్శన్ మెహతా దాఖలు చేసిన ఫిర్యాదుపై సబ్ జడ్జి సందీప్ సింగ్ సేన్ ఈ ఆదేశాలు జారీ చేశారు. నౌబాద్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రాథమిక విచారణ జరిపి, 2026 సెప్టెంబర్ 3లోగా నివేదిక సమర్పించాలని కోర్టు పేర్కొంది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) ప్రకారం, ఏదైనా కాగ్నిజబుల్ నేరం నమోదు చేయడానికి ముందు ప్రాథమిక విచారణ అవసరమని మేజిస్ట్రేట్ స్పష్టం చేశారు. అయితే, ఈ ఆదేశాలను నేరం రుజువైనట్లుగా భావించరాదని ఆయన వెల్లడించారు. ఫిర్యాదుదారు సుదర్శన్ మెహతా తన ఫిర్యాదులో, మన్హాస్ రెండు వేర్వేరు పుట్టిన తేదీలను ఉపయోగించారని ఆరోపించారు. జమ్మూలోని మహారాజా హరి సింగ్ అగ్రికల్చర్ కాలేజియేట్ స్కూల్ రికార్డుల ప్రకారం అతడి పుట్టిన తేదీ 1977 డిసెంబర్ 9 కాగా, ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ వెబ్‌సైట్‌లో 1979 అక్టోబర్ 12గా ఉందని పేర్కొన్నాడు. ఈ వయస్సు వ్యత్యాసం కారణంగానే అతడు సబ్-జూనియర్, జూనియర్ జాతీయ టోర్నమెంట్లలో ఆడేందుకు అర్హత సాధించారని ఆరోపించారు. జమ్మూ కశ్మీర్ నుంచి బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికైన మొదటి వ్యక్తిగా మిథున్ మన్హాస్ గుర్తింపు పొందాడు. అతడు 2025 సెప్టెంబర్‌లో ఈ పదవిని చేపట్టాడు. గతంలో మన్హాస్ ఫస్ట్-క్లాస్ క్రికెటర్‌గా జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం ఇవి ఆరోపణల దశలోనే ఉండగా, పోలీసుల ప్రాథమిక విచారణ తర్వాతే తదుపరి చర్యలపై స్పష్టత రానుంది.

## సచిన్ కంటే కోహ్లీనే శక్తివంతమైన ప్లేయర్: డివిలియర్స్




**ఆసియా బ్యాటర్ల శక్తిని ప్రపంచానికి సచిన్ చాటి చెప్పాడన్న డివిలియర్స్**
**సచిన్ వేసిన పునాదిని అందుకున్న కోహ్లీ జట్టును మరో స్థాయికి తీసుకెళ్లాడని ప్రశంస**
**సచిన్, కోహ్లీ నిర్మించిన బాటలో యువ ఆటగాళ్లు నడుస్తున్నారని వ్యాఖ్య**

సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. విదేశీ మైదానాల్లో, ముఖ్యంగా కఠినమైన టెస్టు పరిస్థితుల్లో భారత్ ఆధిపత్యం చెలాయించడంలో విరాట్ కోహ్లీ పాత్రే అత్యంత కీలకమని స్పష్టం చేశాడు. విదేశీ గడ్డపై జరిగిన టెస్టుల్లో సచిన్ టెండూల్కర్ కంటే కూడా విరాట్ కోహ్లీనే మరింత మెరుగైన, శక్తివంతమైన బ్యాటర్‌గా నిలిచాడని ప్రశంసించాడు. తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన డివిలియర్స్... ఆసియా వెలుపల స్వింగ్, తీవ్రమైన బౌన్స్ ఉండే పిచ్‌లపై ఆసియా బ్యాటర్లు కూడా శతకాలు బాది రాణించగలరని ప్రపంచానికి మొదటగా చూపించింది సచిన్ టెండూల్కర్ అని కొనియాడాడు. అయితే సచిన్ వేసిన ఆ బలమైన పునాదిని అందుకుని, విదేశాల్లో భారత జట్టు ప్రదర్శన స్థాయిని మరో రేంజ్‌కు తీసుకెళ్లి ఆధిపత్యం చలాయించేలా చేసింది మాత్రం కోహ్లీనే అని తేల్చి చెప్పాడు. సచిన్, విరాట్ వంటి దిగ్గజాలు నిర్మించిన ఈ బాటలోనే నేటి తరం యువ ఆటగాళ్లు నడుస్తున్నారని అభిప్రాయపడ్డాడు. కేఎల్ రాహుల్ వంటి అత్యుత్తమ సాంకేతికత కలిగిన బ్యాటర్లు విదేశాల్లో సాధించే సెంచరీలను కేవలం వంద పరుగులకే పరిమితం చేయకుండా 180 ప్లస్ భారీ స్కోర్లుగా మలచడంపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా సూచించాడు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR

## మెగా డాటర్ నిర్మాతగా శ్రీకాంత్ - ప్రకాశ్ రాజ్ సిరీస్!

మెగా డాటర్ సుస్మిత కొణిదెల నిర్మాతగా సినిమాలు .. సిరీస్ లు నిర్మిస్తూ వెళుతున్నారు. తాజాగా ఆమె మరొక సిరీస్ ను తెలుగు పేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. సంగీతం నేపథ్యంలో సాగే ఫ్యామిలీ ఎమోషన్స్ ఈ కథలో ప్రధానంగా కనిపించనున్నాయి. అందువలన ఈ సిరీస్ కి 'జగమే సంగీతం' అనే టైటిల్ ను సెట్ చేశారు. పల్నాటి సూర్యప్రతాప్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ లో శ్రీకాంత్ - ప్రకాశ్ రాజ్ ప్రధానమైన పాత్రలలో కనిపించనున్నారు. ఒకప్పుడు కళాకారులు ఆ కళను తమ వారసులు కొనసాగించాలని బలంగా కోరుకునేవారు. వారసులు కూడా దానిని గర్వంగా స్వీకరించేవారు. అది తమ బాధ్యత అన్నట్టుగా వ్యవహరించేవారు. అలాంటి ఒక కర్ణాటక సంగీత నేపథ్యం కలిగిన కుటుంబం, తరతరాలుగా వారసత్వాన్ని కాపాడుతూ వస్తున్న కుటుంబ సభ్యుల చుట్టూ తిరిగే కథతో ఈ సిరీస్ కొనసాగుతుంది. బంధాలు.. అనుబంధాలు .. ఆచారాలు .. సంప్రదాయాలను టచ్ చేస్తూ ఈ సిరీస్ నడుస్తుంది. తెలుగుతో పాటు తమిళంలోను 'అమెజాన్ ప్రైమ్' లో అందుబాటులోకి రానుంది.




# 'ఇరుముడి' హిట్ ఇచ్చేసేలానే ఉందే!

'ఇరుముడి' .. ఫీల్ తో కూడిన టైటిల్. డివోషనల్ టచ్ ఇచ్చే టైటిల్. ఈ టైటిల్ ను చూడగానే ఈ సినిమా అయ్యప్పస్వామి నేపథ్యంలో నడుస్తుందని అనుకుంటారు. అయ్యప్పస్వామి భక్తుడిగా రవితేజ .. ఆ స్వామి మహిమలను చూపిస్తారని అనుకోవడం సహజం. ప్రధానమైన కథ అదే అయితే ఈ సినిమాను కార్తీక మాసంలో రిలీజ్ చేసేవారు. అయ్యప్ప మాలతో ముడిపడిన ఈ కథలో కనిపించని మరో కోణం ఉంది. అదే ఈ సినిమాను కొత్తగా ప్రేక్షకుల ముంగిట నిలపనుంది. ఆ కోణం ఏమిటనేదే అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమా పోస్టర్స్ ను గమనిస్తే, రవితేజ .. అతని కూతురుగా ఒక పాపను ఎక్కువగా హైలైట్ చేస్తూ వచ్చారు. నిజమే ఈ కథ అంతా హీరో ప్లస్ అతని కూతురు చుట్టూనే తిరుగుతుంది. హీరో ఎవరినీ లెక్కచేయడు .. ఎవరి మాటను వినిపించుకోడు .. తన కూతురు మాట తప్ప. అలాంటి హీరోను అతని కూతురు ఎలా ప్రభావితం చేస్తుంది? అతను అయ్యప్పమాల వేసుకోవడంలోని ఆంతర్యం ఏమిటి? ఆ మాల వేసుకున్న తరువాత అతని జీవితం ఎలా మారిపోతుంది? అనే కథతో ఈ సినిమాను రూపొందించారు. నిజానికి 2022లో వచ్చిన 'ధమాకా' తరువాత రవితేజకి పెద్ద హిట్ లేదు. ఏడెనిమిది సినిమాలు చేసినప్పటికీ అవి ఆశించి నస్థాయి విజయాలను అందించలేక పోయాయి. ఈ నేపథ్యంలోనే 'ఇరుముడి' సిద్ధమైంది. ప్రియా భవాని శంకర్ .. బేబీ నక్షత్ర .. సాయికుమార్ ముఖ్యమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, రేపు ( ఆగస్టు 21) విడుదల చేస్తున్నారు. రవితేజ సినిమా నుంచి ఆడియన్స్ ఆశించే అన్ని అంశాలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు. చూడాలి మరి ఈ సినిమాను ఏ స్థాయిలో ఆడియన్స్ ఆకట్టుకుంటుందో.




# మళ్లీ తన మార్క్ కామెడీతో అల్లరి నరేశ్ 'రంభ ఊర్వశి మేనక' నుంచి కొత్త పాట



కామెడీ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హీరో అల్లరి నరేశ్, చాలా కాలం తర్వాత మళ్లీ తన కామెడీ జానర్‌లోకి పూర్తిస్థాయిలో వచ్చేశారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. ఈ ఫన్ ఎంటర్‌టైనర్ నుంచి చిత్రబృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ఈ క్రమంలో సినిమా నుంచి రెండో పాట 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా'ను గురువారం విడుదల చేశారు. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.చంద్రమోహన్ చింతా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలోని పాట వినసొంపుగా ఉండటమే కాకుండా, సినిమా కథా నేపథ్యాన్ని తెలియజేసేలా ఉంది. ముఖ్యంగా 'వెళ్లవే పేదరికం.. ఇక్కడే ఇల్లరికం' వంటి చరణాలు సినిమాలోని హాస్యభరిత సన్నివేశాలపై అంచనాలను పెంచుతున్నాయి. పేదరికం, కుటుంబ సమస్యల చుట్టూ అల్లరి నరేశ్ మార్క్ కామెడీ ఏ స్థాయిలో ఉండబోతోందో ఈ పాట స్పష్టమైన హింట్ ఇస్తోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. గత కొంతకాలంగా 'నాంది', 'ఉగ్రం' వంటి సీరియస్, ఇంటెన్స్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన అల్లరి నరేశ్, ఈ చిత్రంతో మళ్లీ ప్రేక్షకులను నవ్వించడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రంలో ఆయనకు జోడీగా కథానాయిక సురభి నటిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రవర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రం కచ్చితంగా కుటుంబ ప్రేక్షకులను అలరించేలా ఉంటుందని, నరేశ్ పాత కామెడీ టైమింగ్‌ను అభిమానులు మళ్లీ చూస్తారని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని, 'రంభ ఊర్వశి మేనక' చిత్రాన్ని సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.